# ప్రయోజనం

## ఏ.వి.జి.ఎస్.మూర్తి

పదిహేను రోజులైంది ఈ మహానగరం వచ్చి. తోచక చచ్చిపోతున్నాను. ఎక్కడికి కదులుదామన్నా లేదు. అన్నిటికీ సిటీ బస్సులే! ఏ నంబరు బస్సు ఎక్కడికి పోతుందో అబ్బాయి, కోడలు ఒక్కసారి చెప్తే గుర్తుండదు నాకు. మళ్లీ మళ్లీ అడుగుతూంటే వాళ్లేమో చిర్రుబుర్రు లాడుతారు.

"అయినా డెబ్బై ఏళ్లొస్తున్నాయి కదా... ఊరు మీద పడి తిరగాలని కోరి కేమిటి, నాన్నా నీకు... హాయిగా ఇంట్లో కూర్చుని 'రామా... కృష్ణా...' అనుకోక!" అంటాడు కొడుకు.

"బాగా చెప్పారు... మా నాన్నయితే మొన్న మొన్న కదా రిటైరయ్యారు... రిటైరయ్యిం దగ్గర్నించీ ఇల్లు కదిలితే ఒట్టు... ఎప్పుడూ జపాలు, పూజలు... ఎంచక్కా గీతాపారాయణం... చూస్తూంటే ముచ్చటేస్తుంది..." గొప్పగా చెప్పుకుపోతుంది కోడలు.

"మునలా ళ్లంటే అలా ఉండాలి..." కోడలి మాటలకు కొడుకు సమర్థింపు.

ఒళ్లు మండిపోతోంది నాకు వాళ్ల మాటలు వింటూంటే.

పచ్చని పరిసరాలలో, ఆహ్లాదకరమైన వాతావరణంలో హాయిగా బ్రతుకుతున్న నేను కోడలు, కొడుకు, మనవల మీద ఎనలేని మమకారంతో చేస్తున్న పని మానుకుని, ఇక్కడ సుఖపడదామని వస్తే ఎదురవుతున్న అవమానాలు న న్నెంతగానో బాధపెడుతున్నాయి.

నా ఆలోచనలు పసిగట్టినట్టున్నాడు అబ్బాయి - "ఇదిగో నాన్నా! ఈ కార్డ్ నీ దగ్గరుంచుకో... దీనిమీద సిటీ బస్ నంబర్లు అన్నీ వేసిస్తున్నాను... లైబ్రరీకి వెడతావో, సినిమాకు వెడతావో, పార్క్‌కు వెడతావో నీ ఇష్టం. ఎక్కడికి వెళ్లినా మళ్లీ చీకటి పడకముందే కొంపకి వచ్చేయ్.. అలా రాకపోతే మేం వెతుక్కోలేక చావాలి నీకోసం... జాగ్రత్త. అసలే ముసలిపీనుగవి" అన్నాడు ఆ రోజు.

"ఓ రెం డొందలు పెట్టి సీజన్ టిక్కెట్ కొని తగలేయరాదూ.. నెలంతా చక్కగా ఎక్కడికి కావాలంటే అక్కడికి... ఎన్నిసార్లు కావాలంటే అన్నిసార్లు సిటీ అంతా తిరిగి రావొచ్చు... కాలూ, చెయ్యీ ఆడేదాకా..." విసుక్కుంది కోడలు.

నా మనస్సు చివుక్కుమంది. ఎంత తేలిగ్గా మాట్లాడుతున్నారు... నేను వీళ్ల దగ్గర బ్రతకడానికి వచ్చా ననేగా ఈ చులకన భావం! ఎంత తప్పు చేశాను ఉద్యోగం మానుకుని వచ్చి!

"తాతా... తాతా... ఈ లెక్క చెప్పవూ?" అంటూ వచ్చిన నానిగాణ్ణి - "ఇప్పుడు కాదు పోరా..." అని కసురుకున్నాను చిరాగ్గా. అదే తప్పయిపోయింది ఆవిడగారికి.

"అయ్యో... అయ్యో... అదేవిఁటీ అలా కసురుకుంటారు పసిపిల్లాణ్ణి!" అమ్మ మాటలతో అంతవరకూ పెదవి విప్పని నాని ఏడుపు లంకించుకున్నాడు.

నే నేమీ మాట్లాడకపోవడంతో గొంతు పెంచి "వయసు పెరిగినా బుద్ధి పెరగదు కొంతమందికి.. ఏం చేస్తాం నాయనా మన కర్మ... కొన్నాళ్లపాటు భరించక తప్పదు... ఊరుకో ఏడవకు..." అంది.


నా మనసు చురుక్కుమంది.

"ఏమి టమ్మాయ్ ఆ నోరు... ఇప్పు డేం జరిగిపోయిందని అంతలేసి మాటలు మాట్లాడుతున్నావ్?" బాధగా, కోపంగా అడిగాను.

"నా నో రింతే... నా మాట లింతే..." అనేసి గిరుక్కున తిరిగి వంటగదిలోకి వెళ్లింది. ముందు గదిలోంచి సుందరం - "ఏం జరిగింది, లక్ష్మీ... ఎందు కలా ఉన్నావ్?" అడుగుతున్నాడు ప్రేమగా.

"నాన్నా... మరే... తాతేఁ" అంటూ వెళ్లి ఫిర్యాదు చేయసాగాడు నాని.

"ఏం చేస్తాట్ట ఊరికే కూర్చుని... ఓసారి తాత



నిలా పిలు..." సంధించి విడిచిన బాణంలా వచ్చాడు వాడు. నడుమున చేతులు పెట్టుకుని పెద్ద ఫోజు పెట్టేస్తూ - "ఏయ్... నాన్న పిలుస్తున్నాడు... దా..." అన్నాడు.

అంత కోపంలోనూ వాణ్ణి చూస్తుంటే ముద్దొచ్చింది నాకు. గుండెకి హత్తుకుని ఆ లేత చెక్కిలిమీద ముద్దు పెట్టుకుంటూ "పద... పోదాం" అన్నాను.

ఏ మనుకున్నాడో ఏమో నావైపు వింతగా చూస్తూ - "పోనీ వద్దులే తాతా... మ నిద్దరం పాం పటం ఆడుకుందామా...?" ముద్దు ముద్దుగా అడిగాడు.

నేను ఫకాలున నవ్వేశాను. మనసు చల్లబడింది. వాణ్ణి దగ్గర కూర్చోబెట్టుకుని కాసేపు కబుర్లు కావాలనిపించింది. "ఎందుకు, తాతా, నవ్వుతున్నావు!" అమాయకంగా అడుగుతున్న వాణ్ణి ఒడిలో కూర్చోపెట్టుకుంటూ - "ఏం లేదు నాన్నా.. ఊరికే... ఇప్పుడు నీ కో మాంచి కథ చెప్తాను. కథ తరువాత లెక్క చెప్పేస్తాను. ఏం?" అన్నాను.

అడక్కుండానే కథ చెప్తా నన్నందుకు వాడికి నామీద ప్రేమ పొంగింది. చుబుకం పట్టుకుని అడిగాడు - "లెక్క చెప్పింతరువాత పాం పటం ఆడతావా మరి?"

'అలాగే' అని, దేవదత్తుడి బాణంతో గాయపడిన హంసను సిద్ధార్థుడు కాపాడిన కథను వాడి కర్థ మయ్యే భాషలో చక్కగా వివరించాను.

"సిద్ధార్థుడే గుడ్ బాయ్... దేవదత్తుడు వెరీ బేడ్ బాయ్... భలే మంచి కథ చెప్పావ్ తాతా... ఉండు... నీ కో చాక్లేట్ తెచ్చిస్తా..." అంటూ నా ఒడిలోంచి చెంగున దిగి పరుగెత్తాడు. పుస్తకం కూడా తెచ్చుకోమని చెప్పాను.

"కాకమ్మ కథలతో పిల్లలను బుట్టలో వేసుకోవడం బాగా తెలును..." నా కోసం అమ్మని చాక్లెట్ అడిగినట్టున్నాడు వీడు. మళ్లీ తన అక్కసును వెళ్లగక్కుతోంది.

"కాకమ్మ కథలా ఇవి...! తెలివితేటలు పెరగాలంటే కథలు చదవాలని, ఇంట్లో పెద్దవాళ్ల చేత మంచి మంచి నీతి కథలు చెప్పించుకోవాలని చెప్పారు మా టీచరుగారు... నీ కెట్లాగో రాదు కథలు చెప్పడం... తాత నన్నా చెప్పనీ..." పెద్ద మనవడు వాసు అంటున్నాడు.

"నేర్చుయ్యరా వెధవా... ఆ కథల్లో పడే మార్కులు సరిగా తెచ్చుకోలేకపోతున్నారు... అయినా ఆయన లెక్క చెప్పమంటే కసురుకుని కథ చెప్పడ మేమిటీ... బుద్ధుండక్కర్లా..." నాకు వినిపించేటట్టు వంట గదిలోంచే పెద్దగా అంది.

"ఇదిగో... పుస్తకం తీసుకుని రమ్మన్నాడు తాత... పాపం తాత మంచివాడే లేమ్మా... ఎందుకు ఊరికే తిడుతుంటావు?" అనేసి, ఇంకా అక్కడే ఉంటే ఏమంటుందో ననే భయంతో కాబోలు పరుగున వచ్చి నా దగ్గర చేరాడు నాని.

"బొత్తిగా పాడైపోతున్నారు వెధవలు.. హాస్టల్లో పడేయాలి..." కర్కశంగా అంటోంది లక్ష్మి.

"మే మేం పాడైపోవడం లేదు. ను వ్వెక్కడానివే మమ్మల్ని ఇట్లా అంటుంటావు... స్కూల్లో మాకు గుడ్ నేమ్ ఉంది..." పౌరుషంగా అన్నాడు వాసు.

"చాల్లే వాగుడు... పోయి చదువుకో..." కసిరింది లక్ష్మి.

వాడు కూడా పుస్తకాల సంచీ తీసుకుని నా దగ్గర వచ్చి కూర్చున్నాడు.


** ** **

"తాతా... అన్నానికి పిలుస్తోంది అమ్మ..." నాని పిలుపుతో చదువుతున్న పేపర్ని అవతల పెట్టి వంటగదిలోకి వెళ్లాను.

విస్తట్లో అన్నీ వడ్డించి ఉన్నాయి.

అన్నం పెడుతూంది కోడలు. అందరితో పాటూ కాదు... ప్రత్యేకంగా! ఏదైనా సరే ఒక్కసారి వడ్డిస్తుంది. మళ్లీ అడిగితే వేద్దా మనుకుంటుందో, లేక 'ముసలాడి కిది చాల్లే' అనుకుంటుందో? నేనేమో మళ్లీ అడగలేను. పెట్టిం దేదో తిని వస్తూంటాను. మళ్లీ అరగంటకల్లా ఆకలి మొదలౌతుంది. బయటికి వెళ్లి ఏదైనా కొనుక్కుని తిందామన్నా చేతిలో పైసా ఉండదు.

"ఏమి టీ ఆలోచన... అన్నం ముందు కూర్చుని... త్వరగా కానిస్తే నేను వంటిల్లు కడుక్కోవాలి..."




లక్ష్మి మాటలతో ఉలిక్కిపడి త్వరత్వరగా భోజనం ముగించి ఇవతలికి వచ్చాను.

"తాతా... నీ కోసం పక్కింటి అంకుల్ వచ్చారు... వరండాలో కూర్చుని పేపర్ చూస్తున్నారు." చెప్పాడు వాసు.

పక్కింటి రమణ చేస్తున్న కాన్వెంట్‌లో నాకూ ఏదైనా టీచర్ పోస్ట్ దొరుకుతుందేమోనని వాకబు చేయమని అడిగా నతన్ని. 'ఏం వార్త తెచ్చాడో...' అనుకుంటూ వరండాలోకి వచ్చాను.

లేచి నిలబడి నమస్కరించి - "తెలుగుకి ముగ్గురు టీచ ర్లున్నారండీ... ఇంగ్లీష్‌కేమో నిన్ననే ఓ క్రొత్త టీచ రొచ్చి జాయినయ్యారు. సోషల్ స్టడీస్, మేథమేటిక్స్‌కి టీచర్లు కావాలి... మీ రా సబ్జెక్ట్స్ చెప్పలేమన్నారుగా... పైగా జీతం కూడా రెం డొందల కంటే ఉండదు... వేరేచోట ప్రయత్నించడం మంచి దనిపించింది." చెప్పాడు వినయంగా.

"అదేవిఁటోయ్... ఇంత పెద్ద సిటీలో జీతాలు మరీ ఇంత తక్కువా... !? చిన్న ఊరైనా మా ఊళ్లో కాన్వెంట్లే నయమే... ఐదా రొందలన్నా ఇస్తారు..." అన్నాను.

"హృషీకేశ్ నగర్‌లో మరో పెద్ద కాన్వెం టుందండీ... అక్కడైతే ఆ రొంద లిస్తారు... కానీ సిటీ బస్ ఛార్జీలకే రెం డొందలు పోతుంది... వర్కింగ్ అవర్స్ కూడా ఎక్కువ... మీ రీ వయసులో తిరగలేరు... చేయలేరు..."

"అవును కానీ... మరీ రెం డొందలకి ను వ్వెలా చేయగలుగుతున్నావోయ్..."

"నేను మూ డేళ్లనుండీ చేస్తున్నానండీ ఈ కాన్వెంట్‌లో... ఏడాది కోసారి ఇంక్రిమెంట్లు ఉంటాయి మాకు... ఇప్పుడు నా జీతం, ఇంక్రిమెంట్లు అన్నీ కలుపుకుని నాలు గొందలైంది." ఏదో కాస్త ఫరవాలే దన్నట్టు చెప్పాడు.

"వర్కింగ్ అవర్స్ ఎలా ఉంటాయ్?"

"ఉదయం ఎనిమిది గంటలనుండీ సాయంత్రం ఆరువరకూ... అంటే అయిదు నుంచి ఆరు గంటలవరకూ ట్యూషన్లు కూడా చెప్పాల్సి ఉంటుంది..."

"ట్యూషన్‌కి వేరే ఏమన్నా ఇస్తారా?"

"లేదండీ... అంతా శాలరీలోనే..."

"అంత గొడ్డుచాకిరీ చేస్తే ఇచ్చే జీతం మరీ అంత తక్కువా... ఎంత అన్యాయమయ్యా... !?"

"అవునండీ... అన్యాయమే... మీ రీ వయసులో ఆ శ్రమ పడలేరు... హాయిగా విశ్రాంతి తీసుకోవడం మంచిది... వస్తానండీ... కాన్వెంట్‌కి వెళ్లే టైమైంది..." అంటూ మరోసారి నమస్కరించి హడావిడిగా వెళ్లిపోయాడు.


'హు! విశ్రాంతి! విశ్రాంతి తీసుకోవా లనుకుని ఉన్న ఉద్యోగాన్ని వదిలేసి రాబట్టే వీళ్ల చేత ఇన్ని మాటలు పడవలసి వస్తోంది... ఈ జీవితా నికి క విశ్రాంతి చావులోనే నాయనా... చావులోనే!' అనుకుంటూ బాధగా నిట్టూర్చాను.

"పొద్దుగూకులూ అలా గోళ్లు గిల్లుకుంటూ కూర్చోకపోతే కా స్తైదైనా పని చేసిపెట్టొచ్చుగా... ఒక్కదాన్నీ చేయలేక ఛస్తున్నాను ఇంతమందికీ...

## గట్టిపిండం!

ప్రముఖ నవలా రచయిత, నోబెల్ బహుమాన గ్రహీత ఎర్నెస్ట్ హెమింగ్వే' తన జీవిత కాలంలో అనేక ప్రమాదాలకు లోనయ్యాడు. ఒకసారి అతని తల వగిలింది. సుమారు పన్నెండు ప్రమాదాలలో అతని మెదడు దెబ్బతిన్నది. మూడుసార్లు కారు ప్రమాదాలలోనూ, రెండుసార్లు విమాన ప్రమాదాలలోనూ చిక్కుకున్నాడు. కొంతకాలంపాటు కంటిచూపు అనలేదు. యుద్ధకాలంలో అతని శరీరంలో తొమ్మిది చోట్ల గాయాలయ్యాయి. 18 ఏండ్ల ప్రాయంలో అతను ఇటలీలో కాల్పులకు గురైనప్పుడు వైద్యులు అతని దేహం నుండి 237 అన్యపదార్థాలను వెలికి తీశారు. వీటినన్నిటినీ తట్టుకున్న ఈ అమెరికన్ నవలా రచయిత, తన 62వ ఏట, 1961 జూలై 2న తుపాకితో కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

సేకరణ: పుత్తూరు ఉమ [బళ్లారి]




ఒరేయ్ వాసూ... తాతకి చెప్పరా... కాస్త ఆ బట్ట లుతికి ఆరవేయమని..."

"నువ్వే చెప్పు... నేను చెప్పను అటువంటి పాడు పనులు తాతకి."

"పాడు పనా... వెధవా... రెం డ్రోజులు మురికిబట్టలు వేసి వంపిస్తే తెలుస్తుంది... ఏ పనీ చేయకుండా సోమరిపోతులా కూర్చుంటే తిన్నది అరగొద్దుట్రా... ఫరవాలేదు... చెప్పు... మన పనులు మనం చేసుకోవడంలో తప్పేమీ లేదు... సిటీ బస్సు లెక్కాలంటే భయపడుతూ బయటి పను లెలాగూ చేయలేరు... ఇంటి పనులన్నా చేయకపోతే ఎలా...?"

"మాకు సెలవలేగా... నేను ఉతుకుతాలే... నువ్వు ముందు ఆఫీసుకు పో... లంచవరని వచ్చి రెండు గంటలు టైంపాస్ చేస్తావే...?" విసుగ్గా అన్నాడు వాసు.

"ఓరి రాస్కెల్... నే నింట్లో ఉన్నానని ఏడుస్తున్నావా... ఇదివరకు లేదు ఈ ఏడుపు... బాగానే నేర్చుకుంటున్నావ్ ఆయనగారి దగ్గరనుండి వెధవ బుద్ధులు... పాడు కథలు చెప్పి పాడు చేస్తున్నారు పిల్లల్ని..." కసిగా ఏదేదో అంటోంది.

వెనకా, ముందూ ఆలోచించకుండా ఎంతమాట పడితే అంత మాట ఎంత తేలిగ్గా అనేయగలదు!? తను ఇంట్లో ఉంటే నేను ఏడుస్తున్నానా... నే నున్నానని త నేడుస్తోందా!? నోరు తెరిచి నాలుగూ కడిగేయగలను కాని... గయ్యాళి రకం... మరీ రోడ్డున పడుతుందేమో నసే భయంతో నిశ్శబ్దంగా భరించాను అన్నీ. కాళ్లకు చెప్పులు వేసి బయట పడేంతవరకు ఏదో ఒకటి అంటూనే ఉంది. అమ్మ అటు వెళ్లగానే ఇటు వచ్చాడు వాసు నా దగ్గరికి.


"తాత... అమ్మకీ, నాన్నకీ ను వ్వంటే ఎందు కంత కోపం? ఎప్పుడూ ఎందుకలా తిడుతుంటారు?" ఆ చిన్నారి ప్రశ్నకు బాధపడగలనే కాని నే నేం చెప్పగలను! ఏం చెప్తే వా డర్థం చేసుకోగలడు!?

* * *

విఖనసం నా బాల్య స్నేహితుడు. ఏదో పనిమీద ఈ ఊరు వచ్చిన వాడు నన్ను చూసిపోదామని దిగక దిగక ఆదివారంనాడే మా ఇంట్లో దిగాడు. నేను భయపడ్డట్టే జరిగింది.

"ఈ ముసలాడు... ఈయనకి తోడు ఓ ఫ్రెండు...! ఆదివారం వస్తే కాస్త విశ్రాంతిగా ఉంటుంది కదా అనుకుంటాను... ఎప్పుడూ ఏదో ఒక తద్దినం... ఇంటి పనితోను, ఆఫీసు పనితోను చస్తుపోతున్నాను... నా వల్ల కాదు బాబూ ఈ చాకిరి చేయడం..." వరండాలో కూర్చుని మాట్లాడుకుంటున్న విఖనసానికి, నాకు వినబడేలా సుందరంతో అంటోంది లక్ష్మి.

"ష్... చిన్నగా మాట్లాడు, లక్ష్మి! ఆయన వింటే ఏమన్నా అనుకుంటారు. నాన్నకి నేను చెప్తాలే... ఇకమీదట ఎవరినీ పిలవవద్దని..." అంటున్నా వాడి మాటలూ మాకు స్పష్టంగా వినబడుతూనే ఉన్నాయి. అవమానంతో నా మనసు కుంచించుకుపోయింది. తల ఎత్తి విఖనసం ముఖంలోకి చూడలేకపోయాను. నిర్మొహమాటి అయినవాడు ఏం మాట్లాడతా డోనని భయంగా ఉంది. దాదాపు ఓ రెండు, మూడు నిముషాలు నిశ్శబ్దంగా దొర్లిపోయాయి. తరువాత



వాడే ముందు నోరు తెరిచాడు. "ఎట్లా ఉండగలుగుతున్నావురా ఈ ఇంట్లో!?" జాలిగా చూస్తూ అడిగాడు.

"మనవల్ని చూసుకుంటూ..." నవ్వలేక నవ్వుతూ అన్నాను.

"అబద్ధం... నీ ఆత్మాభిమానం నాకు తెలియంది కాదు... నాన్న ఏదో అన్నాడని నాలుగు నెలల పాటు ఇంటి ముఖం చూడని చిన్ననాటి రఘుని నేను మరిచిపోయా ననుకోకు. ను వ్వెంతగానో ప్రేమించిన లలిత 'అడంగిలా అతి ఆలోచనలు చేస్తా'వని అనగానే ఆమెకు దూరమైపోయిన నీ పౌరుషం గురించి నాకు గుర్తు లేదనుకోకు..." నా కళ్లలోకి సూటిగా చూస్తూ అంటున్నాడు.

నా కళ్లు నీటితో నిండాయి.

"ఆ రోజులు వేరు... ఇప్పుడు వేరు... వృద్ధాప్యం కదా మరి...!" నా మాటలు నాకే పేలవంగా ఉన్నాయి.

"వృద్ధాప్యమా... దేనికి...!? శరీరానికా... మనసుకా!?"

జారి పడబోతున్న కన్నీటిని అదుపు చేసుకోవాలనే ప్రయత్నంలో ఓడిపోయి జలజలా కార్చేశాను బాధాశ్రువులను.

"ఛ... ఛ... ఊర్కో... ఏమిట్రా మరీ ఇలా అయిపోయావు... ఎంత దర్పంగా ఉండేవాడివి... ఆ రఘువేనా నువ్వు...! శరీరానికి వచ్చిన వృద్ధాప్యాన్ని మనసుకు కూడా ఆపాదించేస్తున్న ట్లున్నావ్... నేను చూడు నీ కంటే రెండేళ్లు పెద్దవాడినైనా, ఈ వయసులో కూడా ఎన్నో బాధ్యతలున్నా ఎలా రాజాలా తిరిగేస్తున్నానో... మనసురా... మనసు... దానికి మాత్రం ఎప్పుడూ వృద్ధాప్యం రానివ్వకూడదు..." తెల్లటి మీసం దువ్వుకుంటూ అంటున్న వాడ్ని చూస్తూంటే అంత బాధలోను నా పెదవులపై చిరునవ్వు మొలిచింది.

"చెట్టంత కొడు కున్నాడు... హాయిగా కాలుమీద కాలు వేసుకొని మహారాజ భోగం అనుభవిస్తున్నా వనుకున్నాను... అమ్మాయి పెళ్లికి

ఓ అయిదు వేలు అప్పు కూడా పెడతావని ఆశ పడ్డాను కదరా... ఇదన్నమాట నీ బ్రతుకు!" నిరాశగా అన్నాడు. మళ్లీ అంతలోనే ఉత్సాహాన్ని తెచ్చుకుంటూ - "సరేలే... అయిదు వేలేగా... ఎక్కడో అక్కడ పుట్టకపోదు... శుభలేఖ పంపుతాను... తప్పకుండా ఓ నాల్రోజులు ముందు రా..." అంటూ ఓ పది నిముషాలు అ మాటా ఈమాటా మాట్లాడి ఇక వెళతానని లేచాడు. మలక్‌పేట వెళ్లే బ స్సెక్కించి వచ్చాను.

"అ పల్లెటూరి జీవితమే బావుంది కదరా నీకు... వంట్లో ఓపిక ఉంది కదా... కొన్నాళ్లపాటు అక్కడే గడిపేయకపోయావూ...?" వెడుతూ వా డన్న మాటలు న న్నాలోచింప చేస్తున్నాయి.

"ఇంకా ఈ వయసులో మీ కెందుకండీ ఈ కష్టం... చేతి కందివచ్చిన కొడుకుండగా...!"

"అరు గంటలు కొట్టుకుంటే ఆ రొందలు... ఎందుకయ్యా నీ కీ కాన్వెం టుద్యోగం? హాయిగా అబ్బాయి దగ్గరకి వెళ్లిపోయి ఉండక!"

"కొంద రింతే సుఖపడటానికి పుట్టరు... బొందిలో ప్రాణం ఉన్నంతవరకూ చాకిరీ చేస్తూనే ఉంటారు..."

"అ. ఉద్యోగానికి తోడు ఇంటి దగ్గర ట్యూషన్స్ కూడా... ఏం మనుమలో బాబూ.. వయసు పెరిగినా డబ్బు మీద వ్యామోహం మాత్రం తరగదు..." ఇలా రకరకాల వ్యాఖ్యలు!

మా ఊళ్లో వాళ్ల మాటలు పట్టించుకోకుండానే చాలా కాలం దొర్లించేశాను. తరువాత తరువాత నాకే ఒంటరి జీవితం మీద విసుగు పుట్టి, నా వా ళ్లనే వాళ్ల దగ్గర ఉంటే బాగుంటుందని ఇలా వచ్చేశాను.

ఇప్పు డనిపిస్తోంది తొందర పడ్డానేమోనని! అక్కడా, ఇక్కడా తిరిగి నే నింటికి వచ్చేసరికి మధ్యాహ్నం మూడు గంటలైంది.

"భోజనం చేయకుండా బయటికి వెళ్లొద్దని ఎన్నిసార్లు చెప్పాను నాన్నా నీకు..."

"అమ్మయ్య... వచ్చారా... ఒక్క మాటైనా చెప్పకుండా ఎక్కడికి వెళ్లారోనని ఒహటే ఆందోళన పడిపోతున్నాను... కాళ్లు కడుక్కోండి... భోజనం వడ్డిస్తాను... ఒరేయ్ వానూ... తాతగారికి ఆ టవ లందీయరా..."

'ఇది కలా... నిజమా...!' అనే ఆలోచనలోనే కాళ్లు కడుక్కుని భోజనానికి కూర్చున్నాను... తినాలని లేకపోయినా.

"అదృష్టమంటే మీదండీ బావగారూ...! బంగారం లాంటి కొడుకు... అణిముత్యం లాంటి కోడలు...!" అంటూ వచ్చి నా పక్కనే పీట వాల్చుకుని కూర్చున్నాడు ఈశ్వరయ్య.

'ఓహో... వాళ్ల నటనకి కారణం ఈయన ఆగమన మన్నమాట!' అనవ్వాంతో నా ఒళ్లు జలదరించింది.

"మా వెధవాయి లిద్దరూ పెళ్లాల చేతుల్లో కీలుబొమ్మలైపోయారు... వాళ్లకి నా పొడే గిట్టడం లేదు బొత్తిగా... ఇంక అక్కడ ఉండలే ననిపించి ఇక్కడికి వచ్చేశాను... అమ్మాయి, అల్లుడుగారు ఒప్పుకున్నారు... మీకూ అభ్యంతరం లేకపోతే..." అంటూ అర్థోక్తిలో ఆగిపోయా డాయన. లక్ష్మి అందుకుంది - "మామయ్యగారి దేముంది నాన్నా.. దేవుడి లాంటివారు.. వా ళ్లబ్బాయి ఎంతంటే అంతే... మీరు నిరభ్యంతరంగా ఇక్కడ ఉండిపోవచ్చు... కదు మామయ్యగారూ!"

"ఆ... అంతే... అంతే... నిరభ్యంతరంగా ఉండిపోవచ్చు..." అన్నాను చేయి కడుక్కుంటూ.

"ఇదిగో అమ్మాయ్... ఈ డ బ్బుంచు... పెన్షన్ తాలూకు పదహా రొందలు..." తను ఇక్కడ ఊరికే ఉండిపోవటం లేదనే విషయం నాకు తెలియచెప్పటం కోసం కాబోలు... నాముందే జేబులోంచి కొన్ని నోట్లు తీసి కూతురి చేతిలో పెట్టాడు.

ఆప్యాయంగా అందుకుంటూనే - "ఉండనీ నాన్నా.. ఇప్పుడే ఇవ్వకపోతే ఏం పోయింది...!" అంది లక్ష్మి నావైపు గర్వంగా చూస్తూ.

"తాతా... నీకు రాదా పెన్షను...?" నా దగ్గర చేరి అడుగుతున్నాడు వాను.

"రాదు నాన్నా.. నేను చేసింది ప్రైవేటు ఉద్యోగం కదా... గవర్నమెంటు ఉద్యోగం చేసి రిటైరయిన వాళ్లకే పెన్షన్ నదుపాయం ఉంటుంది."

"మరి ను వ్వెందుకు చేయలేదు తాతా గవర్నమెంట్ ఉద్యోగం?!"

"తెలివితేట లున్నవాళ్లకే వస్తాయి గవర్నమెంటు ఉద్యోగాలు... సర్లే... ఇక నీ కబుర్లు కట్టిపెట్టి వెళ్లి చదువుకో..." కొడుకుని కసిరి బీరువా ఉన్న రూమ్‌లోకి నడిచింది లక్ష్మి.

ఈశ్వరయ్య నావైపు అ దోలా చూసి పళ్లికిలించుకుంటూ కూతురి వెనకే వెళ్లాడు.

"డబ్బు లేనివాడు డుబ్బుకు కొరగాడు... ధనం మూలం ఇదం జగత్...!" లోపల్నించి నాని చదువుతూన్న 'పొదుపు' పాఠం వినిపిస్తోంది.

అప్రయత్నంగా నా కంటినుండి రెండు నీటి బొట్లు రాలాయి.

'నిజమే... డబ్బులోనే ఉంది అంతా...! పైసా సంపాదన లేనివాడు ఎంత తండ్రైనా... మామగారైనా ప్రేమకు అనర్హుడే ఈ లోకంలో. నావల్ల ఖర్చే గాని... అదాయ మేముంది వీళ్లకి? ఏ మాత్రం ధన ప్రయోజనం లేని నన్ను బాగా చూడటానికి పాపం వీళ్లకి మన సెలా ఒప్పుతుంది!?'

నే నిక్కడ ఉండి వీళ్లని ఇబ్బంది పెట్టడం శ్రేయస్కరం కాదు. మా ఊరే పోతాను. ఒంట్లో ఓపిక ఉన్నంతవరకూ అక్కడే కష్టపడతాను. అక్కడే బ్రతుకుతాను... అక్కడే... అక్కడే... రాలిపోతాను! ★

